క్లుప్తంగా

విద్యార్థినులకు ప్రతిభ ఉపకార వేతనాలు



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల విద్యార్థినులు వైఎస్ఆర్ మెమోరియల్ ట్రస్ట్ నుంచి ప్రతిభ ఉపకార వేతనాలు అందుకున్నట్లు ప్రిన్సిపల్ సిస్టర్ విమల మేరీ తెలిపారు. గురువారం కళాశాలలో ఉపకార వేతనాలు అందుకున్న 24 మంది విద్యార్థినులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం పెద పలకలూరులో జరిగిన కార్యక్రమంలో టెస్ట్ పరీక్ష ఫలితాల్లో అధిక మార్కులు సాధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులు నలుగురితో పాటు సీనియర్ ఇంటర్ విద్యార్థులు 20 మంది ఉపకార వేతనాలు అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంఈఓకు ఎన్‌టీఏ సభ్యుల అభినందనలు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని ఎంఈఓ కార్యాలయంలో గురువారం గుంటూరు తూర్పు, పశ్చిమ ఎంఈఓ-1గా బాధ్యతలు చేపట్టిన బీవీ రమణయ్యను కలసిన ఎన్‌టీఏ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా హైమారావు మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. ఎంఈవో రమణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు టీడీఎస్ సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంఈఓను కలసిన వారిలో ఎన్‌టీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ ఖలీల్, ఎన్వీ జగదీష్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి జి.అంతోనీబాబు, సహాధ్యక్షులు వి.సంతోష్‌కుమార్, ఎం.చంద్రశేఖర్, నగర అధ్యక్షుడు పి.సాయి విశ్వనాథ్, నగర నాయకులు ఉన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తాడేపల్లిరూరల్: ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని అవుట్‌సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు గురువారం రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పి.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీలో కాంట్రాక్టు కార్మికులు 7,300 మంది థర్డ్ పార్టీ విధానంలో పనిచేస్తున్నారని, ఈ విధానం వల్ల చాలా నష్టపోతున్నామని తెలిపారు. ఆర్టీసీలో థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని, సానుకూలంగా స్పందించిన మంత్రి నారా లోకేష్ రవాణా శాఖ మంత్రితో మాట్లాడతామని హామీ ఇచ్చారని తెలిపారు. సంఘం జిల్లా నాయకులు కె.శ్రీనివాసులు, కె.అంజిబాబు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తెనాలి డిపోకు త్వరలో 10 కొత్త బస్సులు



తెనాలిఅర్బన్: తెనాలి డిపోకు నూతనంగా 10 కొత్త బస్సులు త్వరలో రానున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల తెనాలి నుంచి బెంగళూరుకు ఏర్పాటు చేసిన బస్సుకు మంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. అలాగే విజయవాడ బస్సుకు కూడా ఆదరణ ఉందన్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సహకారంతో చెరుకుపల్లి, గుంటూరు, ఎర్రగొండపాలెంకు కొత్త బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ప్రయాణికుల కోరిక మేరకు కొన్ని బస్సుల వేళలను కూడా మార్పు చేయడం జరిగిందన్నారు. ప్రమాదాలు జరగకుండా డ్రైవర్లకు ప్రతిరోజు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. శుభకార్యాలు, దేవాలయాల సందర్శనలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని, కావాల్సిన వారు తమను సంప్రదించాలన్నారు. స్టూడెంట్ బస్సు పాసులు ఉదయం 7గంటల నుంచి కౌంటర్‌లో ఇవ్వడం జరుగుతుందని, ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న కళాశాలలు, పాఠశాలల నిర్వాహకులు తమను సంప్రదిస్తే తమ ఉద్యోగులు అక్కడకు వచ్చి జారీ చేస్తారని, ఈ అవకాశాన్ని యాజమాన్యాలు ఉపయోగించుకోవాలని సూచించారు.

పాలన విభజన ఓకే..కార్యాలయ ఏర్పాటు ఎప్పుడో..?

- ఏర్పాటు కాని తూర్పు విద్యాశాఖాధికారి కార్యాలయం
- ఏడాదిన్నరగా తాత్సారం చేస్తున్న విద్యాశాఖ
- ఫలించని మాజీ ఎమ్మెల్యే ముస్తఫా కృషి
- రెండో ఎంఈఓ పోస్టుతో పనిభారం తగ్గించిన గత ప్రభుత్వం
- పరిపాలన సౌలభ్యం కోసం ఈస్ట్, వెస్ట్‌గా విభజన
- ఒకే భవనంలో ముగ్గురు ఎంఈఓల విధులు



గుంటూరు అర్బన్ ఎంఈఓ కార్యాలయం (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల వారీగా ఎంఈఓ కార్యాలయాల విభజనపై విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. భౌగోళికంగా ప్రస్తుతం కలెక్టర్ బంగ్లా రోడ్డులో ఉన్న ఎంఈఓ కార్యాలయం పశ్చిమ అధికారి పరిధిలోకి వస్తుంది. నలుగురు ఎంఈఓలకు ఒకే కార్యాలయం ఉండటంతో విధి నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకే గదిలో ప్రస్తుతం ముగ్గురు విద్యాశాఖాధికారులు పనిచేయాల్సి వస్తోంది. గుంటూరు నగరంలో 205 ప్రభుత్వ పాఠశాలలతో పాటు మరో 300 ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యతలు ఒక్క కార్యాలయం నుంచే జరుగుతున్నాయి.

పరిపాలన సౌలభ్యం.. తగ్గిన పనిభారం

గుంటూరు అర్బన్, రూరల్ కలుపుకుని ఉమ్మడిగా ఉన్న ఎంఈఓ కార్యాలయాన్ని పరిపాలన సౌలభ్యం కోసం.. తూర్పు, పశ్చిమ ఎంఈఓ కార్యాలయాలుగా పరిపాలన విభజన చేసింది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విభజన చేసింది. ప్రతి మండలానికి రెండవ ఎంఈఓ పోస్టు మంజూరు చేసి పనిభారాన్ని తగ్గించింది. జిల్లా కేంద్రమైన గుంటూరులో అర్బన్, రూరల్ పరిధిలో 505 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు వేతన బిల్లుల మంజూరు, సర్వీసు విషయాలను ఎంఈఓలే పర్యవేక్షిస్తున్నారు. గతంలో అర్బన్, రూరల్ కలుపుకుని ఒక ఎంఈఓనే మొత్తం వ్యవహారాలు పర్యవేక్షించేవారు. ప్రస్తుతం గుంటూరు ఈస్ట్, వెస్ట్‌కు కలుపుకుని ఎంఈఓ పోస్టుల సంఖ్య నాలుగుకు చేరింది. రెండవ ఎంఈఓ పోస్టు ద్వారా మండల విద్యాశాఖాధికారులకు పని ఒత్తిడి నుంచి కొంత ఉపశమనం లభించింది. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోకి వచ్చే.. గుంటూరు రూరల్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కూడా ఈస్ట్, వెస్ట్ పరిధిలోకి వస్తాయి. ఎంఈఓలు జాబ్ చార్ట్ ప్రకారం విధులు నిర్వర్తిస్తున్నారు.

ఒక్కటే కార్యాలయం..

ప్రభుత్వ పాఠశాలల్లో స్టూడెంట్ కిట్‌లను ఆయా పాఠశాలలకు సరఫరా చేసి, విద్యార్థులకు పంపిణీ చేయడం, పాఠ్య పుస్తకాలను సకాలంలో అందజేయడం, నిబంధనలను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు కచ్చితంగా అమలయ్యేలా పర్యవేక్షించడం ఎంఈఓల విధులు. గుంటూరు జిల్లా కేంద్రం కావడం, అధిక సంఖ్యలో పాఠశాలలు ఉండడంతో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కొత్తగా ఎంఈఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పరిపాలన సౌలభ్యం కోసం నూతన ఎంఈఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా పలు మార్లు విద్యాశాఖాధికారులకు సూచించినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రస్తుత ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించాల్సిన అవసరముందని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ప్రస్తుతం గుంటూరు ఈస్ట్, వెస్ట్ ఎంఈఓ-2 పోస్టుల్లో నాగేంద్రమ్మ, జ్యోతికిరణ్ విధులు నిర్వర్తిస్తుండగా, పాత గుంటూరులోని మహాకవి తిక్కన-పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా పని చేస్తున్న బీవీ రమణయ్య ఈస్ట్, వెస్ట్ ఎంఈవో-1గా (ఎఫ్ఏసీ) గురువారం బాధ్యతలు చేపట్టారు. ముగ్గురు విద్యాశాఖాధికారులు ఇక్కడే విధులు నిర్వహించాలి.

అభివృద్ధి పనుల్లో ప్రజాప్రతినిధుల సమన్వయం తప్పనిసరి

- వారు గుర్తించిన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి
- జీఎంసీ అధికారులను ఆదేశించిన కమిషనర్ కీర్తి చేకూరి



తూర్పు ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనులు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. వారి క్షేత్రస్థాయి పర్యటనల్లో సంబంధిత అధికారులు పాల్గొని, గుర్తించిన సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్‌తో కలిసి, నియోజకవర్గంలో జరుగుతున్న, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మెరుగైన పారిశుద్ధ్యానికి ఇంజినీరింగ్, ప్రజారోగ్య, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులు ప్రజా ప్రతినిధులు గుర్తించిన పనులను ఫైనాన్షియల్, నాన్ ఫైనాన్షియల్‌గా విభజన చేసుకొని, నాన్ ఫైనాన్షియల్ లేదా తక్కువ మొత్తంలో ఖర్చు అయ్యే ప్యాచ్ వర్క్స్, తాగునీటి సరఫరాలోని సమస్యలు, కల్వర్ట్‌ల నిర్మాణం వంటి వాటిని రోజుల వ్యవధిలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రధానంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, ప్రస్తుతం చేపట్టాల్సిన పనులపై ప్రజా ప్రతినిధులకు వివరించాలన్నారు. నగరంలోని ప్రతి రిజర్వాయర్ పరిధిలో ఎన్ని కొళాయి కనెక్షన్‌లు, వాటిలో కమర్షియల్, డొమెస్టిక్ కనెక్షన్ల వివరాలు, రిజర్వాయర్ నుంచి ప్రైవేట్ ట్యాంకర్లకు ఇస్తున్న నీటి వివరాలపై వారంలో నివేదిక ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించారు. డ్రెయిన్‌ల వెంబడి క్రాస్ చేస్తున్న తాగునీటి పైప్ లైన్‌లు గుర్తిస్తే వాటిని యుద్ధ ప్రాతిపదికన షిఫ్ట్ చేయాలన్నారు. ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం జరగాలని, లేకుంటే వ్యర్థాలు రోడ్ల మీద కాల్వల్లో వేస్తారన్నారు. ఎమ్మెల్యే నసీర్ మహ్మద్ మాట్లాడుతూ ప్రతిపాదించిన పనులను వెనువెంటనే చేపట్టాలన్నారు. వాటిలో తక్షణం చేయలేనివి ఉంటే వివరించాలని కోరారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. తూర్పు నియోజకవర్గంలో తాగునీటి సరఫరా వ్యవస్థపై సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. జీఎంసీ ఖాళీ స్థలాలను గుర్తించి వాటిలో పార్కులు అభివృద్ధి చేయడానికి, ఇప్పటికే ఉన్న పార్కుల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎస్ఈ శ్యామ్‌ప్రసాద్, ఏంహెచ్ఓ మధుసూదన్, ఏడీహెచ్ రామారావు, ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, డీఈఈలు రాము, శ్రీధర్, ఎస్ఎస్‌లు రాంబాబు, ఆయుబ్ ఖాన్, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

లక్ష్మీపురం: చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో 7వ తరగతి విద్యార్థినిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఉపాధ్యక్షురాలు సుచరిత డిమాండ్ చేశారు. గురువారం విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం చేయాలంటూ కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ విద్యార్థిని కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.10 లక్షల ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆరీఫా, దళిత ప్రజా సంఘాల నాయకులున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధం

రూ.6 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని బాధితుల ఆవేదన



దొండపాడు(తాడికొండ): తుళ్లూరు మండలం దొండపాడు గ్రామంలో గురువారం రెండు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన నన్నపనేని నాగేశ్వరరావు, నన్నపనేని హనుమంతరావులకు చెందిన గృహాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. రెవెన్యూ అధికారులు నష్టం వివరాలు నమోదు చేశారు. ఒక్కో ఇంటికి రూ.3 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోతున్నారు.

ఉండవల్లిలో సబ్సిడీ విక్రయ కేంద్రం ప్రారంభం

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో ప్రజల సౌకర్యార్థం నిత్యావసర సరుకుల ప్రత్యేక కౌంటరును టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు అమరా సుబ్బారావు, వల్లభనేని వెంకట్రావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సబ్సిడీ కేంద్రాల్లో కిలో కందిపప్పు రూ.160, సోనా మసూరి బియ్యం కిలో రూ.48లకు విక్రయిస్తారని, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం కోసమే సబ్సిడీ ధరలతో నిత్యావసర సరుకులు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరాఉ. ఈ కార్యక్రమంలో మంగళగిరి సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దారు దుర్గారావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో సమస్యల పరిష్కారానికి వినతి



డీడీకి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

లక్ష్మీపురం: గుంటూరు జిల్లాలోని హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ డిమాండ్ చేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదన్‌రావును ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ మున్సిపల్ ఎస్సీ బాలల వసతి గృహానికి ప్రహరీ, బీసీ హాస్టల్‌లో ఫ్లోరింగ్ ఏర్పాటు చేయాలని, హాస్టల్ అడ్మిషన్స్‌ను నూరుశాతం ఇవ్వాలని కోరారు. వసతి గృహాల్లో సౌకర్యాల కొరత, మెస్, కాస్మోటిక్ చార్జీల పెండింగ్, భవనాల అద్దె చెల్లింపు తదితర అంశాలను వెంటనే పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని డీడీ హామీ ఇచ్చారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు బి.సుచరిత, జిల్లా కమిటీ సభ్యులు ఎ.యశ్వంత్ ఆరిఫా ఉన్నారు.

నేటి నుంచి న్యూరోకాన్ రాష్ట్ర సదస్సు

పోస్టర్ ఆవిష్కరించిన సూపరింటెండెంట్ కిరణ్ కుమార్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ శివరామకృష్ణ

గుంటూరు మెడికల్: ఏపీ న్యూరో కాన్ రాష్ట్ర సదస్సు గుంటూరులో జరుగుతుందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. గురువారం తన చాంబర్‌లో రాష్ట్ర సదస్సు ఆహ్వాన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి 21వ తేదీ వరకు న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు తెలుగు రాష్ట్రాలతో పాటు జాతీయ స్థాయి వైద్యులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. న్యూరాలజీ, న్యూరో సర్జరీ వైద్య విభాగాల్లో వస్తున్న ఆధునిక చికిత్స విధానాలపై వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణమూర్తి, అసోసియేషన్ నేతలు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ చక్కా శివరామకృష్ణ పాల్గొన్నారు.

హామీని అమలుచేయాలి

తెనాలి: రైతులు, కౌలు సాగుదార్లకు పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులతో కలిసి గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి ఎ.జయజయరావుకు తమ డిమాండ్‌తో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా పట్టణ అయితానగర్, రూరల్ మండల గ్రామాలైన కొలవరం, ఎరుకులపూడిలోని సచివాలయాల్లోనూ వినతిపత్రాలను ఇచ్చారు. శివశంకరరావు స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతులు, కౌలురైతులకు బ్యాంకుల్లో ఉన్న రూ.2 లక్షల వరకు ఉన్న అన్ని రకాల రుణాలను మాఫీ చేయాలని కోరారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పంటకాల్వలు, మురుగుకాల్వల్లో అల్లుకుపోయిన తూటాకు, గుర్రపుడెక్కను సత్వరమే తొలగించాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



గుంటూరు నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో గురువారం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌ను కమ్యూనికేషన్ ఎస్పీ రాజశ్రీ, శిక్షణ డీఎస్పీలు భానుప్రకాష్, భార్గవి, సీసీఎస్ డీఎస్పీ శివాజీ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు జిల్లా ఎస్పీకి పండ్లు, మొక్కలు అందించారు. – నగరంపాలెం

పరిపాలన గాలికొదిలేసిన మోదీ

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, పక్కన వనజ, నాగేశ్వరరావు

లక్ష్మీపురం: ప్రస్తుతం దేశం అనేక సమస్యలతో సతమవుతుంటే.. పరిపాలనను గాలికొదిలేసిన ప్రధాని నరేంద్ర మోదీ కార్పొరేట్ సేవలో నిమగ్నమయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో గురువారం జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. అంబాని, అదానీల సంతోషమే తన సంతోషంగా మోదీ భావిస్తున్నారని ఆరోపించారు. గ్రామీణ, రైతాంగ సమస్యలు, పేదరికం అలాగే ఉందని.. వీటిపై మోదీ ఒక్కసారి కూడా మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. విమానాశ్రయాల్లో లగేజీ మోసే ఉద్యోగానికి ముంబైలో 25 వేల మంది పట్టభద్రులు బారులు తీరడం చూస్తే దేశంలో నిరుద్యోగం ఏ స్థాయిలో విలయతాండవం చేస్తుందో అర్థమవుతోందని రామకృష్ణ పేర్కొన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ప్రభుత్వం ఆ హామీని నిలబెట్టుకోలేక పోవడంతో.. డిగ్రీ, పీజీ విద్యార్థులు కూలీలుగా మారుతున్న దుస్థితి నెలకొందన్నారు. మణిపూర్‌కు వెళ్లేందుకు తీరకలేని మోదీ అంబాని కుటుంబ పెళ్లి వేడుకల్లో పాల్గొనడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా, విభజన హామీలను సాధించుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రికి సూచించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ సీపీఐ శత వార్షికోత్సవాలను వాడవాడలా ఘనంగా నిర్వహించేందుకు శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, సీపీఐ జిల్లా నాయకులు చిన్ని తిరుపతయ్య, సింగారావు పాల్గొన్నారు.

జీఓ నంబరు 77ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న నాసర్‌జీ

లక్ష్మీపురం: పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల ఉన్నత చదువులకు ఆటంకంగా మారిన జీఓ నంబరు 77ను తక్షణమే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టల్స్ పర్యటన చేసి, ఆగస్టు 6న జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు యశ్వంత్ దుర్గా సాయి, శివ, డేవిడ్, గౌతమ్, కిరణ్, బన్నీ పాల్గొన్నారు.

డాక్టర్ షమా సుల్తానాకు ఘన సన్మానం



డాక్టర్ షమా సుల్తానా, మెహపారానిలను సత్కరించిన మంత్రి ఫరూక్

గుంటూరు మెడికల్: పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో హోప్ విన్ హాస్పిటల్ ఏర్పాటు చేసి, కేవలం పది రూపాయలకే ఓపీ చూస్తున్న డాక్టర్ షమా సుల్తానా ఎంతో మంది వైద్యులకు మార్గదర్శకమని మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం విజయవాడలోని ఓ హోటల్‌లో సమాజ సేవకు అంకితమై పనిచేస్తున్న కొంతమంది అధికారులు, సమితి నేతలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ షమా సుల్తానా చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని కొనియాడారు. ఆమెతో పాటు ఎంహెచ్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి మెహపారాని సత్కరించారు. ఈ కార్యక్రమంలో టి.డి.జనార్దన్, ఎంపీహెచ్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారూఖ్ షుబ్లీ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

జీవిత బీమా రుణాలు, బాండ్ల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలి



జేడీ అశోక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: జీవిత బీమా రుణాలు, బాండ్ల చెల్లింపుల్లో జాప్యాన్ని నివారించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పేర్కొన్నారు. గురువారం మంగళదాస్ నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా (ఏపీజీఎల్ఐ) ప్రాంతీయ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్ డి.అశోక్‌ను కలసిన యూటీఎఫ్ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీజీఎల్ఐ ద్వారా రుణాలు, బాండ్ల చెల్లింపులు సత్వరమే జరిగే విధంగా చూడాలని కోరారు. రుణాలు, క్లోజర్ల దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం వల్ల అవసరానికి డబ్బులు పొందలేక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అదే విధంగా నూతన వెబ్‌సైట్‌లో ఖాతాలు తప్పుల తడకగా ఉన్నాయని, వీటిని సవరించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై తగు చర్యలు తీసుకుంటామని జేడీ అశోక్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. జేడీని కలసిన వారిలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకుడు మూర్తి, ఏపీజీఎల్ఐ కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.పోతురాజు ఉన్నారు.

చోదకులు హెల్మెట్ తప్పక ధరించాలి

11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు



ర్యాలీలో పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసులు

తెనాలిరూరల్: ద్విచక్రవాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెనాలి మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు అన్నారు. హెల్మెట్‌ధారణ ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని న్యాయస్థానాల ప్రాంగణం వద్ద నుంచి హెల్మెట్ ర్యాలీని న్యాయమూర్తులు, తెనాలి బార్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి జిల్లా జడ్జి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, పోలీస్ అధికారులు, సిబ్బంది, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. ప్ల కార్డులు ప్రదర్శిస్తూ హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలందరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల అనుకోని ప్రమాదాలు జరిగినప్పటికీ ప్రాణాపాయం తప్పుతుందని తెలియజేశారు. అదేవిధంగా వాహన చట్టాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్ కుమార్, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.రాజశేఖర్, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ హరిదాసు గౌరీ శంకర్, వన్‌టౌన్ సీఐ జి.దశరథరామయ్య, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు, న్యాయవాదులు గుమ్మడి రవిరాజు, పెరికల డానియల్, సురేష్, పిల్లి సుధాకర్, లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది మహబూబ్, విజయ, ఆర్.వెంకటేశ్వరరావు, ఖాదర్ హుస్సేన్, పారా లీగల్ సిబ్బంది నాగమణి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ కోర్టు దగ్గర నుంచి గాంధీ చౌక్ వరకు కొనసాగింది.